క్లుప్తంగా

'రాయల'కు పలువురి శుభాకాంక్షలు



ఖమ్మంఅర్బన్: రాయలకు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్లు, నాయకులు

కామేపల్లి/ఖమ్మంఅర్బన్/నేలకొండపల్లి/ఖమ్మంసహకారనగర్: తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రాయల నాగేశ్వరరావును గురువారం హైదరాబాద్‌లో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈనేపథ్యాన కామేపల్లి మండలం కొండాయిగూడెం సొసైటీ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు కే.వీ.చారి, ఖమ్మం నుంచి ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జావీద్, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, పల్లెబోయిన భారతిచంద్రం, దుద్దికూరి వెంకటేశ్వర్లు, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీఓ) రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, టీఎన్జీఓస్ నాయకులు కొణిదన శ్రీనివాస్, నేలకొండపల్లి నుంచి కాంగ్రెస్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, ఎంపీటీసీలు దోసపాటి కల్పన, రేగూరి వాసవి, జెర్రిపోతుల సత్యనారాయణ, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, బోయిన వేణు, రేగూరి హనుమంతరావు, దోసపాటి శేఖర్, ప్రశాంత్, పగిడికత్తుల సుదర్శన్, గంజికుంట్ల వెంకన్న తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నోట్ బుక్స్ వితరణ

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఇందిరానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం వాసిరెడ్డి సేవా సమితి ఆధ్వర్యాన విద్యార్థులకు 500 నోట్ పుస్తకాలను గురువారం అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయురాలు జ్యోతికుమారి ట్రస్ట్‌ను సంప్రదించగా.. వారు ఈ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వీరభద్రరావు, నాగేశ్వరరావు, అర్జున్‌రావు, వెంకటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు అంజనీకుమారి, ఉమాదేవి, జ్యోతికుమారి, శ్యామ్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కోడె దూడ మృతి

కామేపల్లి: మండలంలోని బర్లగూడెం గ్రామానికి చెందిన రైతు భూక్యా నందకు చెందిన కోడె దూడ గురువారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. గ్రామ శివారులోని పంట పొలాల్లోకి నందకు చెందిన కోడె దూడ మేతకు వెళ్లింది. ఈక్రమంలో విద్యుత్ తీగ తెగి ఉండడంతో ప్రమాదవశాత్తు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. సుమారుగా రూ.30 వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు.

ఆర్థిక సాయం

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కేలోతు కమ్మల కుటుంబానికి గురువారం గ్రామ కాంగ్రెస్ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యాన ఆర్థిక సాయం అందించారు. ఈనేపథ్యాన కమ్మల కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5,600లను అందించినట్లు సభ్యుడు తుమ్మలపల్లి నరసింహారావు తెలిపారు.

అన్నదానం

ఖమ్మంఅర్బన్: నగరంలోని మధురానగర్‌కు చెందిన సద్గురు సాయినాథ్ మందిర భక్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యాన ప్రతీ గురువారం అన్నదాన కార్యక్రమం చేపడతారు. ఈనేపథ్యాన సాయిమందిరంలో ప్రత్యేక అభిషేక పూజలు చేసి నగరంలోని అన్నం ఫౌండేషన్‌లో అనాథలకు అన్నదానం చేశారు.

సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు ఎం.హనుమంతరావు, ఎం.పార్వతిలను గురువారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోపగాని రమేష్, ఉపాధ్యాయులు గణేష్, బి.రవి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కల్కి
వినోద	భారతీయుడు 2
సాయిరాం	భారతీయుడు 2
ఆదిత్య	14(తెలుగు)
శ్రీనివాస	భారతీయుడు 2

- ఖమ్మంగాంధీచౌక్

గ్రంథాలయంలో ప్రిపరేషాన్..!



జిల్లా కేంద్ర గ్రంథాలయం

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిరుద్యోగుల సర్దుబాటు చదువులు

- కనీస సదుపాయాలు లేక అవస్థలు
- మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు కరువు
- ఆందోళన చేసినా పట్టించుకోని ప్రభుత్వం
- నోటిఫికేషన్లతో పోటెత్తుతున్న అభ్యర్థులు

ఖమ్మంగాంధీచౌక్: నిరుద్యోగులకు విజ్ఞాన ఖనిగా నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం చాలా ఏళ్లుగా విరాజిల్లుతోంది. కానీ గత కొన్ని నెలలుగా కనీస సదుపాయాలు లేక అభ్యర్థులు అవస్థలు పడుతున్నారు. కొత్త ప్రభుత్వం రావడంతో వివిధ విభాగాలకు చెందిన నోటిఫికేషన్లు, షెడ్యూళ్లు వెలువడుతుండగా.. నిరుద్యోగులు ఆయా ఉద్యోగాల సాధన కోసం విజ్ఞాన ఖనుల బాట పడుతున్నారు. ఈనేపథ్యాన గ్రంథాలయానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగున ఉన్న మహబూబాబాద్, సూర్యాపేట, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల నుంచి కూడా వచ్చి కిరాయి గదుల్లో ఉంటూ గ్రంథాలయంలో చదువుకుంటున్నారు. నిత్యం 600 మంది నిరుద్యోగులు ఉపాధ్యాయ పోస్టుల డీఎస్సీ, గ్రూప్–1, గ్రూప్–2 వంటి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు. ఇక్కడ రోజులో 18 గంటల పాటు చదువుకునేందుకు వీలున్నా.. మరుగుదొడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలు లేకపోవటంతో పడరాని పాట్లు పడుతున్నారు.

వేధిస్తున్న మరుగుదొడ్ల సమస్య..

జిల్లా కేంద్ర గ్రంథాలయం కార్యాలయ భవనం, పరిపాలన విభాగం భవనం, మహిళలు, పిల్లల రీడింగ్ రూమ్‌లు శిథిలావస్థకు చేరడంతో ఆరు నెలల క్రితమే కూల్చివేశారు. ఇదే సమయాన ఈ భవనాలకు ఆనుకొని ఉన్న మరుగుదొడ్లను సైతం తొలిగించారు. అప్పటి నుంచి గ్రంథాలయానికి వచ్చే నిరుద్యోగులకు మరుగుదొడ్ల సమస్య వేధిస్తోంది. మహిళలకు మూడు మరుగుదొడ్లు మాత్రమే ఉండగా.. పురుషులకు ఒక్కటి కూడా లేదు. నిత్యం 250 మంది మహిళా అభ్యర్థులు వస్తుండడంతో వారికీ అవి సరిపోవడం లేదు. ఇక కొందరు పురుషులు సమీపంలోని మున్సిపాలిటీ సులభ కాంప్లెక్స్‌కు డబ్బులు చెల్లించి వెళ్తుండగా.. మరికొందరు చెట్లు, పుట్టల వెంటకు వెళ్తున్నారు.

తాగు నీటి పరిస్థితి అదే..

జిల్లా గ్రంథాలయంలో మినరల్ వాటర్ సరఫరా ఉన్నప్పటికీ పలు సందర్భాల్లో, భోజన సమయాల్లో తాగు నీటి కొరత ఏర్పడుతుంది. ఇందులో వినియోగించే నీటి సమస్య తీవ్రంగా ఉండగా.. ఆ నీటితోనే నిర్వాహకులు, నిరుద్యోగులు సర్దుకుంటున్నారు. బుక్స్ కూడా పూర్తిస్థాయిలో లేక, సకాలంలో అందకపోవడంతో ప్రిపరేషన్ సక్రమంగా సాగించలేకపోతున్నామని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరు నెలలుగా సమస్య..

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మరుగుదొడ్ల సమస్య గత ఆరు నెలలుగా వేధిస్తోంది. శిథిల భవనాన్ని తొలిగించారే తప్ప కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయడం మరిచారు. సమస్య పరిష్కారం కోసం ఇటీవల నిరుద్యోగులు రహదారిపై బైఠాయించి ఆందోళనలు చేపట్టారు. అయినా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేదు. పైగా పోలీస్ యంత్రాంగం రహదార్లపై ఆందోళనలు చేయొద్దని నిరుద్యోగులపై ప్రత్యేక నిఘా పెట్టడంతో వారు కూడా భయపడుతున్నారు. స్వచ్ఛ భారత్ కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వాలు గ్రంథాలయంలోని కనీస సౌకర్యాలను కల్పించడంలో విఫలం అవుతున్నారు. ఇక గ్రంథాలయ నిర్వాహకులు తమకేమి పట్టనట్లు వ్యవహరించడంతో పాటు సంస్థ ఉన్నతాధికారులతో సంప్రదించి సమస్య పరిష్కారానికి ఏమాత్రం కృషి చేయడం లేదు. నిరుద్యోగులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం ఉండడం లేదు.



తొలగించిన శిథిల భవన స్థలంలో నిరుద్యోగులు

మరుగుదొడ్ల సమస్య వేధిస్తోంది..



డీఎస్సీ ప్రిపరేషన్ కోసం నిత్యం జిల్లా గ్రంథాలయానికి వస్తున్నా. రోజులో ఎక్కువ సమయం ఇక్కడే గడపాల్సి వస్తోంది. కానీ మరుగుదొడ్ల సమస్య వేధిస్తోంది. పురుషులకు కనీసం మూత్రశాలలు కూడా లేవు. తప్పని పరిస్థితుల్లో సమీపంలోని సులభ కాంప్లెక్స్‌లకు వెళ్లాల్సి వస్తుంది. ఇకనైనా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా పాలకులు చర్యలు తీసుకోవాలి.

– బి.రమేష్, నిరుద్యోగి

పట్టించుకునే నాథుడే లేడు..



జిల్లా గ్రంథాలయంలో కనీస సౌకర్యాలపై పాలకులు ఎవరూ పట్టించుకోవడం లేదు. మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని అధికారులకు వినతులు అందించినా.. ఫలితం ఏమాత్రం కనపడడంలేదు. రాజకీయ పార్టీలకతీతంగా, వారి ప్రమేయం లేకుండా ఆందోళనలు చేపట్టినా ఎవరూ స్పందించకపోవడం మా దురదృష్టం.

– మాధవరావు, నిరుద్యోగి

సంస్థ అనుమతిస్తే నిర్మాణాలు..

సంస్థ ఉన్నతాధికారులు నూతన నిర్మాణాలకు అనుమతిస్తే మరుగుదొడ్ల నిర్మాణం చేపడతాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా తాత్కాలికంగా అయినా ఏర్పాటు చేయలేని దుస్థితి. సమస్యను గుర్తించాం కానీ పరిష్కార మార్గాలు మా చేతుల్లో లేవు. అనుమతులు రావడమే ఆలస్యం.

– అర్జున్, ఇన్‌చార్జ్ కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ

కేఎంసీలో బయోమెట్రిక్ బంద్..

- నెల క్రితం పాడైన మిషన్లు
- ఎవరూ పట్టించుకోకపోవడంతో తొలగించిన సిబ్బంది
- హాజరు నమోదు సక్రమంగా సాగేనా?



బయోమెట్రిక్ మిషన్లను తొలగించిన దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో సిబ్బంది, ఉద్యోగులు, అధికారులు హాజరు నమోదు కోసం మూడేళ్ల క్రితం బయోమెట్రిక్ మిషన్లను ఏర్పాటు చేసి వారి హాజరు నమోదు ప్రకారమే వేతనాలను చెల్లిస్తూ వస్తున్నారు. ఇందు కోసం డీఆర్ఎఫ్ సిబ్బంది, ఔట్ సోర్సింగ్, రెగ్యులర్ ఉద్యోగుల కోసం మూడు మిషన్లను కమిషనర్ చాంబర్ ఎదురుగా ఉండే ఐటీ వింగ్ గది గోడకు అమర్చారు. గతంలో మిషన్లు చెడిపోతే ఒకటిలేదారెండు రోజుల్లోనే వాటిని మరమ్మతులు చేయించేవారు. కానీ ప్రస్తుతం మిషన్లు పాడై నెల రోజులు కావొస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

పేరుకే ఐటీ వింగ్..

కేఎంసీలో కంప్యూటర్ల నిర్వహణ, సర్వర్లను పర్యవేక్షించేందుకు ఒక ఉద్యోగిని సైతం ఏర్పాటు చేశారు. ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ రేంజ్‌లో కేఎంసీలో కొంత మంది ఆపరేటర్లు ఐటీ వింగ్ పేరుతో ఒక విభాగాన్నే ఏర్పాటు చేసుకున్నారు. అయినా బయోమెట్రిక్ మిషన్లు పని చేయకపోవడం గమనార్హం. మిషన్లకు మరమ్మతులు చేయించేందుకు సదరు సిబ్బందిని ఆదేశించేందుకు ఒకానొక దశలో అధికారులు సైతం బయపడుతున్నారని, కావాలనే మిషన్లు నిలిచిపోయేలా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఒకేసారి మూడు మిషన్లు ఎలా చెడిపోతాయని ప్రశ్నిస్తున్నారు. కాగా, బయోమెట్రిక్ మిషన్లు పని చేయడం లేదని వాటిని అక్కడ నుంచి తొలగించారని, హాజరు ప్రకారమే జీతాలు చేస్తామన్న అధికారులు ఇప్పుడు దేని ఆధారంగా ఇస్తారో వేచి చూడాల్సిందే మరి.

చెక్‌డ్యామ్ నిర్మాణాలకు స్థలాల పరిశీలన



ఖమ్మంరూరల్: తీర్థాలలో మున్నేటి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న దయాకర్‌రెడ్డి, తదితరులు

నేలకొండపల్లి/ఖమ్మంరూరల్ : రైతులకు వేసవిలో సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా భూగర్భ జలాల నిల్వలు పెరిగేలా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి త్వరలో చెక్‌డ్యాంల నిర్మాణాలు చేపట్టబోతున్నారని మంత్రి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం రూరల్ మండలంలోని తీర్థాల, మున్నేరు కాల్వను పరిశీలించి ఆలయ అవసరాలు, స్థానిక రైతులకు ఉపయోగపడేలా మినీ చెక్‌డ్యాం నిర్మాణం అవసరాన్ని గుర్తించినట్లు తెలిపారు. అనంతరం నేలకొండపల్లి మండలంలోని కట్టుకాచారం, పైనంపల్లి ఏరు, సదాశివాపురం గ్రామాల్లోని వాగులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ నిర్మాణాలతో సాగు విస్తీర్ణం పెరుగుతుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి ఎవరికీ ఇబ్బందులు రాకుండా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఐబీ ఈ వెంకటేశ్వరరావు, డీఈలు తాళ్లూరి నరేష్, ఇరిగేషన్ ఈఈ ఎం.వెంకటేశ్వర్లు, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం ఇరిగేషన్ డీఈఈలు మన్మధరావు, రమేష్‌రెడ్డి, ఏఈ నరేష్, నేలకొండపల్లి సొసైటీ డైరెక్టర్ తీగ రమణయ్య, కాంగ్రెస్ నాయకులు కళ్లెం వెంకటరెడ్డి, ఏనుగు వుంకటరెడ్డి, బోడా వెంకన్న, కొడాలి గోవిందరావు, వెన్నపూసల సీతారాములు, చందూనాయక్, తీగ వెంకటేశ్వరరావు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రీ స్కూల్ పాఠ్యాంశాల బోధనపై శిక్షణ

కామేపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలలో నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా సవరించిన ప్రీ స్కూల్ పాఠ్యాంశాల బోధనపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ నిర్వహించారు. మండలంలోని ముచ్చర్ల రైతు వేదికలో ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో విద్యా బోధన చేయాలని సూచించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల చిత్ర ప్రదర్శన

నేలకొండపల్లి: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నేలకొండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం దేశంలో పెరుగుతున్న జనాభా, ఇతర వనరులు, దేశ చరిత్రను తెలిపేలా విద్యార్థులు గీసిన చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు దేశంలో పెరుగుతున్న జనాభా వలన కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గోపగాని రమేష్, ఉపాధ్యాయులు గణేష్, బి.రవి తదితరులు పాల్గొన్నారు.

వేంను కలిసిన ముప్వా

ఖమ్మంవన్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లో గురువారం రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వేంకు మొక్కను అందించి పలు విషయాలపై చర్చించారు.

కలెక్టర్‌ను కలిసిన డీసీఎంఎస్ చైర్మన్..



కొత్వాలను సత్కరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమితులైన డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు గురువారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించగా.. తిరిగి కొత్వాలకు కలెక్టర్ శాలువా కప్పి సన్మానించారు. ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల సహకార అధికారి ఖుర్షీద్, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ కె.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

గురు పౌర్ణమి వేడుకలు ప్రారంభం



సాయినాథుడికి హారతి ఇస్తున్న భక్తులు



శ్రీకృష్ణసాయి ఆశ్రమంలో హోమం..

ఖమ్మంగాంధీచౌక్: గురుపౌర్ణమి వేడుకలు సాయిబాబా మందిరాల్లో గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. 11 రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకల సందర్భంగా భక్తులు మాలాధారణ చేసి ఉపవాస దీక్షలు చేస్తున్నారు. సాయిబాబా మందిరాలు, ఆశ్రమాల్లో జూలై 21 వరకు హోమాలు, పూజలు నిర్వహించేలా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యాన నగరంలోని త్రీటౌన్ హర్కారా బావి రోడ్ రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీకృష్ణసాయి ఆశ్రమంలో, గాంధీచౌక్ సెంటర్‌లో ఉన్న శ్రీవర ప్రదాత షిర్డీ సాయి మందిరంతో పాటు నగరంలోని పలు సాయిబాబా ఆలయాల్లో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆశ్రమ చైర్మన్ లగడపాటి రామారావు,, ప్రధాన కార్యదర్శి సిద్దంశెట్టి నాగమణి, చౌడవరపు మధుసూదన్‌రావు, కొదుమూరు శ్రీనివాసరావు, నరహరి రమేష్‌కుమార్, పుల్లఖండం వెంకటరామారావు, షిర్డీ సాయి మందిర కమిటీ చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నిరంజన్, కోశాధికారి కురువెళ్ల వెంకటజగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

డివిజన్ల వారీగా 'ఏబీసీ' ఆపరేషన్లు చేయాలి



ఏబీసీ సెంటర్‌లో మాట్లాడుతున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: కుక్కల నియంత్రణ కోసం చేస్తున్న ఆపరేషన్లను క్రమపద్ధతిలో నిర్వహించాలని, ఫిర్యాదులు వస్తే డివిజన్ల వారీగా ఆపరేషన్లను పూర్తి చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం నగరంలోని ఏబీసీ సెంటర్, ఎఫ్ఎస్‌టీపీ, దానవాయిగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని సందర్శించిన ఆయన ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాల్లో డివిజన్ల వారీగా కుక్కలకు ఆపరేషన్లు చేయాలన్నారు. అనంతరం ఎఫ్ఎస్‌టీపీ నిర్వహణను పరిశీలించి రోజుకు ఎన్ని ట్యాంకర్ల వ్యర్థాలు వస్తాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత దానవాయిగూడెంలో అంగన్‌వాడీకేంద్రాన్ని సందర్శించి అక్కడున్న సమస్యలపై ఆరా తీయగా.. నీటి ట్యాంకర్ అపరిశుభ్రంగా ఉండడం, నీరు లేకపోవడాన్ని గమనించి అంగన్‌వాడీల నిర్వహణకు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయాలని వార్డు ఆఫీసర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఎ.సంపత్‌కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే అలైన్‌మెంట్ మార్చాలి



మాట్లాడుతున్న నిర్వాసితుల సంఘం నాయకులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరానికి, కలెక్టర్ కార్యాలయం మధ్యలోనిర్మించనున్న నాగపూర్–అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేస్తూ గురువారం రైతులు, ప్లాట్లదారులు, పట్టణ వాసులు ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ గణేష్‌కు అందించారు. ఈ సందర్భంగా నిర్వాసితుల సంఘం నాయకులు బొంతు రాంబాబు, నాగళ్ల శ్రీధర్, వేములపల్లి సుధీర్ మాట్లాడుతూ.. నేషనల్ హైవే అథారిటీ గైడ్‌లైన్స్ ప్రకారం గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణాన్ని పట్టణాలు, గ్రామాల సమీపాన చేయకూడదని, భూసేకరణ చట్టం నిబంధనలు ఉల్లంఘించి భూ సేకరణ ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ఖమ్మం అభివృద్ధికి ఆటంకంగా ఉన్న హైవేను నిలుపుదల చేయాలని, రైతులు, భూ నిర్వాసితులు, ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో తీర్థాల, కామంచికల్, రఘునాథపాలెం, మల్లేమడుగు తదితర గ్రామాలకు చెందిన రైతులు, ప్లాట్లదారులు, మందనపు రవీంద్ర, బోజెడ్ల వెంకటయ్య, నల్లమోతు శ్రీనివాసరావు, వజ్జా రాధాకృష్ణ, రేహమాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కరెంట్ కోత

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్ సబ్‌స్టేషన్ పరిధిలో గల మద్దులపల్లి ఫీడర్‌లోని తల్లంపాడు ఇండస్ట్రియల్ ఫీడర్‌లలో మరమ్మతుల కారణంగా నేడు(శుక్రవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ క్రాంతిసింహ గురువారం తెలిపారు. దీంతో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు మద్దులపల్లి, పొన్నేకల్, తల్లంపాడులలో కరెంట్ ఉండదని, వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

21న నెల నెలా వెన్నెల

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఈ నెల 21వ తేదీన నెలనెల వెన్నెల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అమర జీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్, కళా సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, ఎ.సుబ్రమణ్యకుమార్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు నిర్వహించే ప్రదర్శనలో విశాఖపట్నం తెలుగు కళాసమితి వారిచే 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?'అనే నాటిక ఉంటుందని తెలిపారు. ఖమ్మం కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు వీవీ అప్పారావు, అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవి, కార్యదర్శి వేల్పుల విజేత, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నామ లక్ష్మీనారాయణ, వేముల సదానందం తదితరుల సహకారంతో నిర్వహించే కార్యక్రమాన్ని కళాభిమానులు, కళాకారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పశువుల మేత వద్ద ఘర్షణ

నేలకొండపల్లి: పశువుల మేత విషయమై ఇరువురు మధ్య ఘర్షణ జరగగా ఒకరికి గాయాలయ్యాయి. మండలంలోని అనాసాగారానికి చెందిన రైతు జి.సత్యనారాయణ అదే గ్రామానికి చెందిన బి.నాగేశ్వరరావు మధ్య గురువారం పశువుల మేత విషయమై పంచాయితీ జరిగింది. ఈ క్రమంలో సత్యనారాయణపై నాగేశ్వరరావు కర్రతో దాడి చేయగా ఆయన గాయపడడంతో చికిత్స అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రోడ్డులోని బల్లేపల్లి సమీపాన గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడ్డాడు. ఓ యువకుడు రోడ్డుపై వెళ్తున్న క్రమంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోగా.. తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా యువకుడి వివరాలు తెలియాల్సి ఉంది. ఈఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని అర్బన్ పోలీసులు తెలిపారు.

సబ్ కమిటీల పేరుతో కాలయాపన..



రైతు సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: శాసనసభ ఎన్నికల సమయాన రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సబ్ కమిటీలు, రైతుల అభిప్రాయాల పేర్లతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా కింద ఎకరానికి 15 వేలు, కూలీలకు 12వేలు ఇవ్వాలని, సమగ్ర పంటల భీమా పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట రైతు సత్యాగ్రహం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 200 రోజులు అవుతున్నా.. రైతు పెట్టుబడి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుందని దుయ్యబట్టారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రైతుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందన్నారు. కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దొంగల సత్యనారాయణ, ఉపేందర్‌గౌడ్, సంతోష్‌రెడ్డి, కోటేశ్వరావు, నాగేశ్వరరావు, గుత్తా వెంకటేశ్వర్లు, పుల్లయ్య, సీతారాములు, ఎల్లారావుగౌడ్, ప్రసాద్, మల్లారెడ్డి, సుధాకర్, వెంకటేశ్వర్లు, గోపి, వెంకట్, రామకృష్ణ, కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

తిరుమలాయపాలెం: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకుడు కమ్మకోమటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని పిండిప్రోలులో గురువారం అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పంటల కోసం అప్పులు దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యాన వెంటనే రుణమాఫీ చేయడంతో పాటు రైతు భరోసా ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిమ్మిడి హన్మంతరావు, పార్టీ మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు ఎడ్లపల్లి నవీన్, శంకర్, ఆరెంపుల వెంకన్న, సరోజిని, విజయ్, మీగడ సత్యం, వెంకన్న, తుపాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి..

కామేపల్లి: రైతులకు పెట్టుబడి సాయం వెంటనే అందించాలని తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కామేపల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వం కంటే రైతులకు అదనంగా పెట్టుబడి సాయాన్ని ఇస్తామని చెప్పి నేటికీ అందించకుండా రైతుల అభిప్రాయ సేకరణ అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించి ఆదుకోవాలని కోరారు.